TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 339 | బుధవారం 16-07-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

## డిగ్రీలు కాదు.. కావాల్సింది నైపుణ్యం

### కొత్త విషయాలు నేర్చుకుంటేనే విజయాలు: శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూలై 15:** ప్రస్తుత పరిస్థితుల్లో డిగ్రీల కంటే నైపుణ్యమే కీలకమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాలం చెల్లిన జ్ఞానాన్ని విడిచిపెట్టి, నిరంతరం నూతన విషయాలను నేర్చుకుంటూ ముందుకు సాగితేనే విజయాలు వరిస్తాయని పేర్కొన్నారు. లెర్న్, అన్ లెర్న్, రీ లెర్న్' అనేది ఇప్పుడు సక్సెసకు ఫార్ములా అని వివరించారు. మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'మన అమెరికా తెలుగు సంఘం(మాట) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ పొందినవారికి మంత్రి ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పటిలా చేతిలో డిగ్రీ ఉంటే ఉద్యోగాలు వచ్చే పరిస్థితి లేదని, 50% మంది పట్టభద్రులకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు లేవని నాస్కామ్ గుర్తించిందని తెలిపారు.

## ప్రియుడు, తమ్ముడితో కలిసి భర్త హత్య

### రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు భార్య స్కెచ్

**యాదగిరిగుట్ట రూరల్, జూలై 15:** ప్రియుడు, తమ్ముడితో కలిసి భర్తను హత్య చేయించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించిన భార్య, అందుకు సహకరించిన ఇద్దరిని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం భువనగిరి డివిజన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ కేసు వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్లకు చెందిన వస్తుపుల స్వామి(38) భువనగిరిలో పనులు ముగించుకుని స్నేహితుడు వీరబాబుతో కలిసి ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై గ్రామానికి బయలుదేరాడు. రాయగిరి–మోత్కూరు ప్రధాన రహదారి కాటేపల్లిలోని బ్రిడ్జి దాటగానే వెనక నుంచి వచ్చిన ఓ కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామి మృతిచెందగా, వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై అనుమానం ఉందని స్వామి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. స్వామి భార్య స్వాతి ఇందుకు సూత్రధారిగా గుర్తించి ఆమెను, మరో ఇద్దరిని అరెస్టు చేశారు. తుర్కపల్లి మండలం పల్లెపాడుకు చెందిన గుంటి సాయికుమార్ భువనగిరిలోని ఓ మార్బుల్ దుకాణంలో పనిచేసేవాడు. అక్కడికి సమీపంలోని ఓ మోటారు దుకాణంలో స్వాతి పనిచేస్తుండేది. ఈ క్రమంలో వారి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది.

## రైతులపై పెట్టుబడి పెట్టండి

### మోసగించేవారికి రుణాలిస్తే ఎలా?

### వేల కోట్లు తీసుకుని దేశం వదిలి పారిపోతున్నారు

### రైతులైతే తీసుకున్న రుణానికి ప్రతిపైసా చెల్లిస్తారు: తుమ్మల



**హైదరాబాద్/చిక్కడపల్లి, జూలై 15:** "రైతులపై పెట్టుబడి పెట్టాలి. బ్యాంకులను మోసం చేసి వేలకోట్లు దండుకొని విదేశాలకు పారిపోయేవారిపై నమ్మకం పెట్టుకుంటే ఏం లాభం? రైతులు బ్యాంకుల నుంచి అప్పు తీసుకుంటే నయాపైసా బాకీ లేకుండా వడ్డీతో సహా చెల్లిస్తారు. సరైన సమయంలో రైతులకు రుణాలిచ్చి బ్యాంకర్లు అండగా నిలబడాలి" అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నాబార్డు 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నాబార్డు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తుమ్మల మా ట్లాడారు. వ్యవసాయేతర రుణాలు తీసుకున్న వారు ఎగ్గొట్టినవి ఎన్ని ఉన్నాయో, వ్యవసాయ రుణాలు తీసుకున్న వారు ఏ మేరకు ఎగ్గొట్టారో బేరీసు వేసుకోవాలని సూచించారు. రైతులు కూడా పెద్దమొత్తంలో రుణా లు తీసుకుని ఎగ్గొట్టొచ్చా అని వ్యాఖ్యానించారు. వాణిజ్య బ్యాంకులతో పోలిస్తే గ్రామీణ బ్యాంకులు రైతులకు చేదోడువాదోడుగా ఉంటున్నా యన్నారు. రైతులు, మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉన్నదని పేర్కొన్నారు. వ్యవసాయం, పశు పోషణ, సహకార సంఘాలు, ప్రకృతి వ్యవసాయం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధిలో నాబార్డు కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు.

# పెట్టుబడులతో తరలిరండి

### పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

- పారిశ్రామిక విధానాలను మరింత మెరుగుపరుస్తాం
- రాయితీలు, అనుమతుల్లో సానుకూల వాతావరణం
- ప్రభుత్వాలు మారినా కొనసాగేలా విధానాలు
- బల్క్ డ్రగ్, డేటా సెంటర్ల కేంద్రంగా హైదరాబాద్
- పొరుగు రాష్ట్రాలతో కాదు.. ప్రపంచంతోనే పోటీ
- జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన



**మేడ్చల్, జూలై 15 :** పారిశ్రామిక విధానాలను మరింత మెరుగుపర్చుకుంటూ తెలంగాణను పెట్టుబడులకు నిలయంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తామని, పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లి జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ పరిశ్రమ నూతన యూనిట్‌కు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రభుత ్వం తరఫున అభినందిస్తున్నామన్నారు. "ప్రపంచ బల్క్ డ్రగ్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంది. దేశంలో 33 శాతం టీకాలను కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నారు. బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం ఇక్కడే ఉత్పత్తి చేస్తున్నారు. కొవిడ్ సమయంలో దాదాపు వంద దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత జీనోమ్ వ్యాలీకి దక్కింది. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్‌లో ఉంది. పారిశ్రామిక రంగం అభివృద్ధికి అవసరమైన రాయితీలు, ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు, అనుమతుల జారీ తదితర విషయాల్లో సానుకూల వాతావరణం కల్పిస్తాం. తెలంగాణను మరింత అభివృద్ధి చేసేందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలి" అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాలను ముందుకు తీసుకువెళ్లే విధంగానే నిర్ణయాలు ఉంటాయని, పారిశ్రామిక పాలసీలు, ఇన్సెంటివ్‌లు, అనుమతులు ఇచ్చే విషయంలో విధానపరమైన నిర్ణయాలను మెరుగుపర్చుకుంటూ ముందుకువెళ్తున్నామని తెలిపారు. ఇంకా మెరుగైన నిర్ణయాలు తీసుకుని దేశంలో పెట్టుబడిదారులను రాష్ట్రానికి ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

**డేటా సెంటర్స్‌కు అడ్డాగా హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిన్నరలోనే దాదాపు రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు ఆహ్వానించామని, ప్రస్తుతం డేటా సెంటర్లకు హైదరాబాద్ నిలయంగా మారిందని, బయో ఫార్మసీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించడంలో ముందుందని తెలిపారు. తెలంగాణకు మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ పోటీ కాదని, ప్రపంచ దేశాలతోనే పోటీ పడాలని చెప్పారు. ప్రపంచంలో ఉన్న అధునాతనమైన విధానాలను, పరిశ్రమలను రాష్ట్రానికి ఆహ్వానించాలన్నారు. దేశ ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఐకార్ మేనేజింగ్ డైరెక్టర్ సూదిన ఆనంద్ రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు.

## బాధ్యత రేవంత్‌రెడ్డిదే



**హైదరాబాద్, జూలై 15:** రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యార్థుల మరణాలు, ఫుడ్ పాయిజనింగ్ ఘటనలకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏడాదిలో కలుషిత ఆహారంతో వేలమంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని, 100 మందికి పైగా మరణించడానికి ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని ఎక్స్ వేదికగా ఆరోపించారు. ఇన్ని విషాద ఘటనలు జరుగుతున్నా విద్యా శాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి కనీసం సమీక్షించకపోవడం నియంతృత్వ, అమానవీయ పాలనకు నిదర్శనమని విమర్శించారు. "రేవంత్ కనీసం ఒక తండ్రిగా ఆలోచించాలి. ప్రభుత్వమే విషంపెడితే ఆ చిన్నారులు ఎవరికి చెప్పుకోవాలి? తన పిల్లలకు అలాంటి విషాహారం పెడితే రేవంత్‌రెడ్డి ఊరుకుంటారా? ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఆయన పిల్లలుంటే చూసీచూడనట్లు ఉంటారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. గురుకులాల్లో దారుణాలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు.

## సీపీఐ నేత దారుణ హత్య

### సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చందు నాయక్‌పై కాల్పులు

**చాదర్‌ఘాట్, జూలై 15:** సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చందు నాయక్ (50) దారుణహత్యకు గురయ్యారు. స్థానికులు, పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం మలక్‌పేట పరిధిలోని శాలివాహన నగర్ పార్కు వద్ద చందు నాయక్ వాకింగ్ చేస్తుండగా కారులో నలుగురు దుండగులు అక్కడికొచ్చారు. చందు నాయక్‌ను వెంబడించి ఆయన కళ్లలో కారంకొట్టి.. తుపాకీతో ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు. మూడు బుల్లెట్లు ఆయన శరీరంలోకి దూసుకెళ్లాయి. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. వచ్చిన కారులోనే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. మలక్‌పేట సీఐ నరేశ్ తన సిబ్బందితో ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు.

## సురక్షితంగా భూమికి శుక్లా

### 18 రోజుల యాక్సియం-4 మిషన్ విజయవంతం

### షెడ్యూల్ ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో దిగిన డ్రాగన్ క్యాప్సూల్.. నలుగురు వ్యోమగాములూ క్షేమం

### మరో 7 రోజులు వారంతా పునరావాస కేంద్రంలోనే!



**న్యూఢిల్లీ, జూలై 15:** భారత కీర్తిపతాకను అంతరిక్షంలో సగర్వంగా ఎగురవేసిన వాయుసేన కెప్టెన్, వ్యోమగామి శుభాన్షు శుక్లా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎసఎస్) నుంచి క్షేమంగా భూమికి తిరిగొచ్చారు! యాక్సియం–4 మిషన్‌లో భాగంగా మరో ముగ్గురు వ్యోమగాములు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోష్ ఉజ్‌నైన్‌స్కీ (పోలండ్), టిబోర్‌కాపు (హంగరీ)తో కలిసి జూన్ 26న ఐఎసఎసకు చేరుకున్న శుక్లా.. 18 రోజులపాటు అక్కడ పలు ప్రయోగాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. నిర్ణీత షెడ్యూలు ప్రకారం.. ఆ నలుగురితో కూడిన డ్రాగన్ క్యాప్సూల్ (దాని పేరు గ్రేస్) భారత కాలమానం ప్రకారం సోమవారం (జూలై 14న) సాయంత్రం 4.45 గంటలకు ఐఎసఎస్ నుంచి విడివడింది. ఆ తర్వాత కొద్ది సేపటికే.. ఐఎసఎస్ చుట్టూ ఉండే 200 మీటర్ల 'కీప్ అవుట్ స్ఫియర్'ను.. 4 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే అప్రోచ్ ఎలిప్సాయిడ్‌ను దాటేసి.. గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో భూమి బాట పట్టింది. దాదాపు 22.5 గంటల ప్రయాణం తర్వాత.. భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు (అమెరికా సమయం ప్రకారం తెల్లవారుజామున 2.31 గంటలకు) కాలిఫోర్నియాలోని శాన్‌డియాగో తీరానికి సమీపాన పసిఫిక్ మహాసముద్రంలో దిగింది. 3.07 గంటలకు.. తాము బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నామని మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ క్యాప్సూల్ నుంచే రేడియో సందేశం పంపారు.

# పరిశ్రమలకు త్వరలో హరిత ఇంధనం

- సింగిల్ టైమ్ సెటిల్‌మెంట్‌గా విద్యుత్ బిల్లుల పరిష్కారం
- ఎఫ్‌టీసీసీఐ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో భట్టి

హైదరాబాద్, గన్‌పార్క్, జూలై 15 : రాష్ట్రంలోని పరిశ్రమలకు త్వరలో హరిత ఇంధనాన్ని సరఫరా చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన నగరంలోని 'ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫటీసీసీఐ)' నూతన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఫోర్త్ సిటీగా పరిగణిస్తోన్న ఫ్యూచర్ సిటీ రాష్ట్రానికి ఒక గేమ్ చేంజర్ కాబోతుందని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్డు పనులు పూర్తయితే హైదరాబాద్ అభివృద్ధి ఎవరి ఊహకు అందదని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డుకు, ఔటర్ రింగ్ రోడ్డుకు మధ్య ఐటీ, ఫార్మా, హౌజింగ్ వంటి క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తున్నామని, వాటిని అభ్యుదయ పారిశ్రామికవేత్తలకు కేటాయించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. తమది ప్రజల ప్రభుత్వమని, పారిశ్రామికవేత్తల కోసం ద్వారాలు తెరిచే ఉంటాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు చిన్న సమస్య వచ్చినా స్పందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు యావత్తు మంత్రిమండలి సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పారిశ్రామికవేత్తలు



కోరినట్లు పెండింగ్‌లో ఉన్న విద్యుత్తు బిల్లులను సింగిల్ టైమ్ సెటిల్‌మెంట్ కింద పరిష్కరించే ఆలోచన చేస్తామన్నారు.

## బీసీలను మోసగించాలని చూస్తే ఉద్యమిస్తాం

### స్థానికంలో 42% రిజర్వేషన్లు అమలు చేయకపోతే భూకంపమే

### బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం మహాధర్నాలో నాయకులు

**కవాడిగూడ, జూలై 15 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసిన తరువాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే రాష్ట్రంలో భూకంపం సృష్టిస్తామని పలువురు నాయకులు హెచ్చరించారు. అమలు కాని హామీలు, ఆర్డినెన్స్‌ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూస్తే తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం చేపడతామని తెలిపారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో బీసీల మహాధర్నా నిర్వహించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ తమిళనాడు తరహాలో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు కావాలంటే ఈ అంశాన్ని రాజ్యాంగం 9వ షెడ్యూల్ లో చేర్చేలా పార్లమెంటు ద్వారా చట్టం రూపొందించేందుకు కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే తెలంగాణలో భూకంపం సృష్టిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. జీవోలతో రిజర్వేషన్లు అమలు అవుతాయంటే ఇన్నాళ్లు ఎందుకివ్వలేదని మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ ప్రశ్నించారు.

## బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగించాలి

### వారికి 10% రిజర్వేషన్ అమలు చేయొద్దు: సంజయ్



**సిరిసిల్ల జూలై 15:** "బీసీ రిజర్వేషన్ల అమలు అంశం వెనక పెద్ద కుట్ర దాగి ఉంది. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించి.. అందులో ముస్లింలకు 10% రిజర్వేషన్లు అమలు చేయాలనుకోవడం దుర్మార్గం. బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగించాలి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మోదీ గిఫ్ట్ పేరుతో 10వ తరగతి విద్యార్థులకు ఆయన సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 51% ఉన్న బీసీలకు 32% మాత్రమే రిజర్వేషన్లు అమలు చేస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం 12% ఉన్న ముస్లింలకు మాత్రం 10% రిజర్వేషన్లు అమలు చేసేందుకు సిద్ధమవడం దుర్మార్గమని మండిపడ్డారు. రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని, అవాస్తవాలను మీడియా ద్వారా ప్రజలకు చేరవేస్తోందన్నారు. కొన్ని బీసీ సంఘాలు ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు.

## కాంగ్రెస్‌వి రిజర్వేషన్ రాజకీయాలు

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్/ఘట్‌కేసర్ రూరల్/కోదాడ, జూలై 15**

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ పేరుతో ప్రజల చెవిలో పువ్వు పెట్టే ప్రయత్నం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఓటు బ్యాంకు కోసమే కాంగ్రెస్ రిజర్వేషన్ నాటకమాడుతోందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు అందులో 10 శాతం మతపరమైన రిజర్వేషన్లను కలపాలని చూస్తోందని.. ఇది బీసీలకు వ్యతిరేక చర్య అని స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగాల్లో మతపరమైన 4 శాతం రిజర్వేషన్లను బీజేపీ గతంలోనే వ్యతిరేకించిందని గుర్తుచేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మునిసిపాలిటీ పరిధిలోని అవుశాపూర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత కోసం మంగళవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో రాంచందర్‌రావు మా ట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే, కాంగ్రెస్ సర్కారు కూడా అవినీతి, ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వాలు పంచాయతీ వ్యవస్థలను నిర్వీర్యం చేశాయని మండిపడ్డారు. పార్టీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు కదలాలంటే నాయకులు కలిసికట్టుగా ముందు కెళ్లాలన్నారు. బీజేపీ ప్రభుత్వం రావాలన్న ఆకాంక్ష ప్రజల్లో ఉందని, ఇప్పుడు కూడా పార్టీ సిద్ధం కాకపోతే పొరపాటు నాయకులదేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ఈ నెల 18 నుంచి 20 వరకు జిల్లా స్థాయి, 21 నుంచి 23 వరకు మండల స్థాయి వర్క్‌షాప్‌లు. 25, 26 తేదీల్లో పోలింగ్ బూత్ బైఠక్‌లు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అత్యధిక జిల్లా పరిషత్‌లు కైవసం చేసుకునే ందుకు పార్టీ నేతలంతా ఐక్యంగా పనిచేయాలని కోరారు. సమష్టిగా పని చేసి స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదామని పార్టీ నేతలకు ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు.

# పోరాటయోధుడు రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభకు తరలి రావాలి

## మేచరాజుపల్లి గ్రామంలో - గోడపత్రిక ఆవిష్కరించిన నేతలు



**తొవ్వ, నెల్లికుదురు, జూలై 15**

విప్లవ పోరాట యోధుడు, రైతు సంఘాల ఆలిండియా కోఆర్డినేషన్ నాయకుడు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి జులై 16న కొత్తగూడెం జిల్లా ఇల్లందులోజరుగుతుందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తొర్రూర్ డివిజన్ నాయకులు జక్కుల యాకయ్య అన్నారు. జూలై 16న భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జరుగు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సభకు మంగళవారం గోడపత్రికను మండలంలోనిమేచరాజు పల్లి లో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయల చంద్రశేఖర్ విద్యార్థి దశ నుండే విప్లవోద్యమంలో చురుకుగా పాల్గొన్నాడని అన్నారు. 6దశాబ్దాల జీవితం 50 సంవత్సరాలు విప్లవోద్యమ కార్యకలాపాలలోనే నడిచిందని అన్నారు. విప్లవోద్యమ అవసరాల రిత్యా అనేక జిల్లాలు మారటమే కాకుండా ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో రహస్య జీవితాన్ని సైతం ఎన్నో కష్టాలకు ఓర్చి అనుభవించాడని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ మహానగరంలో జరిగిన చారిత్రాత్మక రైతాంగ పోరాటంలో కీలకపాత్ర పోషిస్తూ అనేక రాష్ట్రాలు తిరిగాడని అన్నారు. రైతాంగ పోరాట ప్రభావంతో వెనక్కి తీసుకున్న మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డి దారిన నేడు మోడీ ప్రభుత్వం అమలుకు పునుకుంటుంటే రైతాంగ సమస్యలపై అపార అనుభవం ఉన్న రాయల చంద్రశేఖర్ లాంటి రైతు నాయకుడు లేని లోటు కనిపిస్తుందని అన్నారు. రైతు పంటకు గిట్టుబాటు ధర చట్టం తేవాలని, దేశంలో మతం ముసుగులో మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని దీనికి వ్యతిరేకంగా ప్రజా, విప్లవ ఉద్యమాన్నిఅభివృద్ధి చేయటంలో రాయల చంద్రశేఖర్ నిర్విరామకృషి సాగించాడని అన్నారు. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతాంగానికి రుణమాఫీ చేయకపోవడం పంట రుణాలు ఇవ్వకపోవడం కరెంటు కోతలు పోరాటమే రాయల చంద్రశేఖర్ కు నిజమైన నివాళి అని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ నాయకులు దొడ్డ కేశవులు, రవీందర్, వెంకన్న, సాయిలు రమేష్, వెంకన్నతదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ మహిళా కార్యకర్త బాధావత్ శాంతమ్మ మృతి చాలా బాధాకరం

## - కాంగ్రెస్ జిల్లా నేతలు గుగులోతు బాలాజీ నాయక్, ఆకుతోట సతీష్

**తొవ్వ, నెల్లికుదురు, జూలై 15**

కాంగ్రెస్ మహిళా కార్యకర్త బాధావత్ శాంతమ్మ మృతి చెందడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గూగుల్ బాలాజీ నాయక్, జిల్లా యువ నేత ఆకుతోట సతీష్ లు తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్ద తండా (మేచ రాజు పల్లి) గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ బాదావత్ శాంతమ్మ మృతి చెందారు విషయం తెలుసుకున్న నేతలు ఆమె స్వగృహానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కృషి చేస్తామన్నారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ శాఖ అధ్యక్షులు వీరన్న నాయక్, మండల నాయకులు జంగా వంశీ యాదవ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు శ్రీను నాయక్, రాజు, శివలాల్, మధు, రమేష్, సురేష్, తదితరులున్నారు.



# ఎస్బిఐకి నూతన మేనేజర్ ఎప్పుడొస్తారో

**ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ బదిలీతో కస్టమర్లకు ఇక్కట్లు!**

**రైతుల, స్వయం సహాయక సంఘాల మహిళల రుణాల మంజూరులో జాప్యం!!**

**చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు**




**తొవ్వ, నెల్లికుదురు, జూలై 15**

మండలంలోని 30 గ్రామ పంచాయతీల తోపాటు సుమారు వంద తండాలలోనిప్రజల ఆర్థిక లావాదేవీల కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్బిఐ బ్యాంకు సేవలు అందించడంలో జాప్యం జరుగుతున్న అధికారులు పట్టించుకోని తీరు తెల్లమవుతుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న బ్యాంకు మేనేజర్ బదిలీలో భాగంగా గత 15 రోజుల క్రితం బదిలీ కావడం జరిగింది. ఈ క్రమంలో నూతన మేనేజర్ రాకపోవడంతో బ్యాంకులో లావాదేవీలు మందకోడిగా కొనసాగుతున్నాయి. అంతేకాకుండా వర్షాకాలం సీజన్ లో పంటల పెట్టుబడి సహాయంగా రైతులకురుణాలు మంజూరు చేయాల్సి ఉండగా మేనేజర్ లేకపోవడంతో రైతులు నానా ఇక్కట్లు పడుతున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామని ఒకవైపు చెబుతున్న క్రమంలో రుణాలు అందించి ఆదుకోవాల్సిన బ్యాంకులు, బ్యాంకు మేనేజర్ లేరనే సాకు తో మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు జాప్యం అవడంతో దిక్కుతోచని స్థితిలో మహిళలు బ్యాంకు చుట్టూ తిరుగుతూ విసుగు వేసారి పోతున్నారు. అంతేకాకుండా బ్యాంకులో డిప్యూటేషన్ పై వచ్చిన అధికారులు ఉన్నప్పటికీ వారి పరిధి మేరకే పనులు చేస్తుండడంతో అనేక పనులు జాప్యం అవుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా నెల్లికుదురు ఎస్బిఐ శాఖకు కొత్తగా మేనేజర్ రావడానికి జంకుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. బ్యాంకులో గతంలో వివిధ రుణాలు మంజూరు లో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపణలపై శాఖాపురమైన అధికారులతో పాటు విజిలెన్స్, అధికారులు గత రెండు నెలలుగా పలు దఫాలుగా విచారణ జరుపుతున్న కారణంగా ఇక్కడికి ఎవరు మేనేజర్ గారావడానికి సాహసించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా తక్షణమే నూతన మేనేజర్ తో పాటు మరికొంత సిబ్బందిని నియామకం చేసి కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదింప చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలి

**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి: జూలై 15**

రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల విషయంలో 42 శాతం ఆర్డినెన్స్ తీసుకొచ్చి మరోసారి బీసీలను మోసం చేయనీకి కుట్ర చేస్తుందని 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్లో ఆమోదింపజేసుకొని షెడ్యూల్ 9 చేర్చడం ద్వారా మాత్రమే శాశ్వత పరిష్కార మార్గం అని అలా అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు కావడం జరుగుతుంది లేనియెడల ఆర్డినెన్స్ వల్ల వచ్చే రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్తే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో హైకోర్టుకు వెళ్తే ఆర్డినెన్స్ ద్వారా తీసుకొచ్చిన 42 రిజర్వేషన్ను కొట్టివేయడం జరుగుతుంది. కావున రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి పార్లమెంట్లో బిల్లు ఆమోదింప చేయాలని నిరసిస్తూ మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీసీల మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంనకు రామన్నపేట నాయకులు హాజరై మద్దతు తెలిపారు. హాజరైన వారిలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం ,మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, టీఆర్ఎస్వీ నాయకులు బోయపల్లి నాగరాజు, టిఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షులు ఆవుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.




# సర్కారుబడుల్లోనే సకల సౌకర్యాలు

## మండల విద్యాశాఖ అధికారి ఏ .రాందాస్

**తొవ్వనెల్లికుదురు,జూలై 15**

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దు స్తులు తదితర సకల సౌకర్యాలు ఉంటాయని మండల విద్యాశాఖ అధికారి ఏ రాందాస్ అన్నారు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం వివిధ పాఠశాలకు యూనిఫామ్ క్లాత్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు సువిశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపార పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు పాఠ్యపుస్తకాలు ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేయడం జరిగిందని ప్రస్తుతం ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ మస్కాపురి సుధాకర్, కంప్యూటర్ ఆపరేటర్ హెచ్ ఉపేందర్, సిఆర్పిలు అసోధ భాస్కరరావు, బొడ్డు వీరస్వామి, బైరు కవిత, జంపాల కవిత మెసెంజర్ రత్నపురపు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్సి ని వెంటనే ప్రకటించి అమలు చెయ్యాలి

## KGBV టీచర్ లకు కనీస వేతన స్కేల్‌ను అమలు చెయ్యాలి :

## తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ




**తొవ్వ, ప్రతనిధి, ఇబ్రహీంపట్నం జూలై 15:**

నూతన పిఆర్సి ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (TPUS) తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ సభ్యత నమోదు కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత అభియాన్ కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ KGBV టీచర్లకు కనీస వేతన స్కేల్ వర్తింపజేయాలని, సమ్మె కాలపు వేతనాలు వెంటనే చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, నూతన పిఆర్సి ని అమలు చేయాలని , ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు స్పందించి తపస్ సంఘ సభ్యత్వం తీసు కొని సంఘంలో సభ్యులుగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ ఇబ్రహీంపట్నం మండల శాఖ అధ్యక్షులు వడ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాపోల్ ప్రవీణ్ కుమార్, మండల గౌరవ అధ్యక్షులు రవీందర్, మండల కోశాధికారి రాము, మీడియా కన్వీనర్ మహేష్, వెంకట రమణ, నివేదిత, నందిత, జ్యోతి, సంజీవ రాణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ దొడ్డయ్య గారి గోపమ్మ మృతి



**తొవ్వ, ఇబ్రహీంపట్నం, జులై 15**

ఈరోజు ఆరుట్ల గ్రామంలో కామ్రేడ్ దొడ్డయ్య గారి గోపమ్మ మరణించడం జరిగింది. గతంలో సిపిఎం పార్టీ నుండి13వ వార్డు సభ్యులుగా గెలిచి 2013 నుండి 2018 వరకు సేవలందించడం జరిగింది. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హాజరై సిపిఎం పార్టీ కోసం ఆమె చేసిన సేవలను గుర్తు చేశారు. ఆమె పార్థివ దేహం పై సిపిఎం నాయకులు ఎర్రజెండాను కప్పి పూలమాల వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు మార బుగ్గ రాములు మండల కమిటీ సభ్యులు పుల్లగళ్ల గోపాల్ మాజీ కో ఆప్షన్ నెంబర్ యూసుబ్ ఆలీ , శాఖ కార్యదర్శి బోయపల్లి అంజయ్య , సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కొండగారి శంకరయ్య, సాతిరి సత్తయ్య, తాళ్ల నరసింహ, కిష్టయ్య, పిడుగు గాలయ్య, సిఐటియు నాయకులు జోగు శేఖర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఏర్పుల వీరేశం, వ్యవసాయ సంఘం నాయకులు అనంగల్ అశోక్, ఏర్పుల భాస్కర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు అనుపాటి గణేష్ మరియు కట్ట నరసింహ, నూతన గంటి లక్ష్మయ్య పాల్గొని జోహార్లు అర్పించడం జరిగింది

# వెల్లంకిలో పర్యటించిన తమిళనాడు అధికారుల బృందం



**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: జులై 15**
రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామంలో మంగళవారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ టీం తమిళనాడు అధికారుల బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం రైతు వేదిక పల్లె ప్రకృతి వనం గ్రంథాలయం నర్సరీ మరియు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతి గది లో ఉపాధ్యాయులు పాఠాలు బోధించిన విధానాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతగా రుచిగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాల అమలు బాగుందని ప్రజలు వీటిని ఉపయోగిం చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ప్రతాప్ నాయక్, ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీ ఓ రవూఫ్ అలీ, గ్రామ ప్రత్యేక అధికారి ఆశిష్ రాఘవ, ఏపీవో వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, పంచాయతీ కార్యదర్శి మోహన్, గ్రామపంచాయతీ సిబ్బంది అంగన్వాడి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పలు పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ ధనుసరి. శ్రీదేవి

## - బుధరావుపేట కాంప్లెక్స్ హెడ్మాస్టర్ సయ్యద్ ఆరిఫ్ హుస్సేన్

**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, జూలై,15:**
బుధరావుపేట కాంప్లెక్స్ పరిధిలోని నాది తండా, ఎంపీపీ ఎస్ బుధరావుపేట పాఠశాలలను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య డేస్ లో విద్యార్థుల నమోదు ఎఫ్ ఆర్ ఎస్ మధ్యాహ్న భోజనం తదితర అంశాలు పరిశీలించడం జరిగింది. రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల బృందంతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని ప్రతి పాఠశాలలో ఎఫ్ ఆర్ ఎస్ హాజరు శాతం 100 ఉండాలని ఆమె అన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందజేయాలని తెలిపారు. విద్యార్థులలో కనీసం అభ్యాసన





సామర్థ్యాలు వచ్చేల కృషి చేయాలన్నారు. అందరి విద్యార్థులకు చదవడం ,రాయడం, గణిత సామర్థ్యాలు వచ్చేల చూడాలన్నారు. వర్షాకాలం దృష్ట నిత్యం పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఎంపీపీ ఎస్ బుధరావుపేట పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా పెంచినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు స్టాఫ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ఎం జైత్రం నాయక్, ఇన్చార్జి హెచ్ఎం బద్రు, సీఆర్పీ భాస్కర్ మరియు ఉపాధ్యాయులు వీరన్న, సూరయ్య ,పవన్, రామయ్య, రవీంద్ర చారి, సంపూర్ణ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాలాజీ ఇంటిగ్రేటెడ్ మరియు అక్షర లో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

## - విద్యాసంస్థల అధినేత డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి

**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, జూలై 15:**
బాలాజీ విద్యాసంస్థల్లో ఒక్కటైన అక్షర ద స్కూల్ మరియు బిట్స్ స్కూల్ వన మహోత్సవ కార్యక్రమం పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి గారు, ట్రెజరర్ డాక్టర్ వనజ మేడం గారు పాల్గొని పిల్లలతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదపడతాయని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా విద్యార్థులు గ్రీన్ కలర్ దుస్తులు ధరించి ఇంటి వద్ద నుండి తీసుకొచ్చిన మొక్కలను పాఠశాల ఆవరణలో నాటారు. అనంతరం వన మహోత్సవం పై డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్



రాజేశ్వర్ రెడ్డి గారు బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపల్ జ్యోతి గారు, అక్షర స్కూల్ ప్రిన్సిపల్ జి. భవాని గారు, సి ఏ ఓ సురేష్ గారు ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ నూతన అధ్యక్షులుగా దూరు యాకన్న ఏకగ్రీవ ఎన్నిక



**తొవ్వ, నర్సింహులపేట, జూలై 15**
మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆటో యూనియన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడిగా దూరు యాకయ్య, ఉపాధ్యక్షుడిగా రేఖ కిషోర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సమ్మెట రమేష్ గౌడ్, కోశాధికారిగా ఏర్పుల యాకన్న, సహాయ కార్యదర్శిగా ఎస్.కె మై పాషా లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు దూరు యాకయ్య మాట్లాడుతూ.... ఆటో డ్రైవర్ లు ఎదుర్కొనే సమస్యలను ఐక్యంగా పోరాడి పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఎన్నికలో గౌరవ సలహాదారులు కొండ బత్తిని రమేష్, బండపల్లి రవి, బత్తుల రమేష్, మహ్మద్,అంజద్, సమ్మెట శ్రీనివాస్, బొమ్మగాని సురేష్, ఆటో యూనియన్ సభ్యులు అంకం రామకృష్ణ, మేకల సుధాకర్, ధర్మారపు బాబు, పొన్నం శ్రీను, ఎల్లావుల శేఖర్, ఎర్ర రవి, రామస్వామి, సాయిలు, అనిల్, ఉమేష్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# బంజరలో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

**తొవ్వ, నర్సింహులపేట, జులై 15**
మండల కేంద్రంలోని నరసింహపురం బంజర గ్రామంలో సీసీ రోడ్ల అభివృద్ధి పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జినుకల రమేష్ ప్రారంభించారు. డోర్నకల్ శాసనసభ్యుడు ,ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రు నాయక్ కృషి మేరకు రూ.10 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను గ్రామ పార్టీ అధ్యక్షుడు నీలం వెంకన్న అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా జినుకల రమేష్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. ప్రతి పేదవాడికి సంక్షేమం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏయ్ సుగుణాకర్, మాజీ ఉపసర్పంచ్ వెంకన్న, నీలం ధనుంజయ్, గుగులోతు అనిల్ నాయక్, శ్రీను, పరుశరాములు, రవి, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.



### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన

# ఏకలవ్య సంఘం బాద్యులు

### ఆర్థిక సహాయంగా 6 వేలు అందజేత



**తొవ్వ, ప్రతినిధి, నర్సంపేట, జూలై 15:**
బాధిత కుటుంబాన్ని నర్సంపేట నియో జకవర్గ ఏకలవ్య భాద్యులు పరామర్శించారు.. చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన పాలకుర్తి యాకయ్య (96) అనే కురువృద్దుడు అనారోగ్యంతో బాధపడుతూ మరణించగా ఆయన స్వ గృహానికి చేరుకొని ఆయన పార్ధీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు..అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. .మృతునికి రిటైర్డ్ ఎమ్మార్వో భిక్షపతి మాజీ జడ్పీటీసీ వర్ధన్నపేట సారంగపాణి విజయ్ కుమార్ ఎల్లస్వామి కుమారులు ఉన్నారు..కుమార్తె ఉన్నారు.. బాధిత కుటుంబానికి ఏకలవ్య సంఘం మండల అధ్యక్షుడు నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షుడు పులిశేరు జంపయ్య సంఘం బాద్యులు 6 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురి శ్రీనివాస్ పాలకుర్తి ప్రభాకర్ పల్లకొండ తిరుపతి పులిశెరు వెంకటేష్ పులిశెరు సమ్మయ్య దుగ్యాల సమ్మయ్య పులిశెరు రాజేందర్ పల్లకొండ సారయ్య రాయపురి పెద్ద సమ్మయ్య సమ్మయ్య పల్లకొండ కార్తీక్ పల్లకొండ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటి, మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మార్వో నంగునూరి. రమేష్.



**తొవ్వ, ప్రతినిధి, ఖానాపూర్, జూలై 15:**
ఖానాపురం మండలం లోని రాగం పేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నైనా నాటాలని ఆయన అన్నారు. మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని అరికట్టగలు గుతామని, సురక్షితమైన ఆక్సిజన్ తీసుకోగలుగుతామని అన్నారు. మొక్కలు సమృద్ధిగా ఉండటం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. దీనివల్ల అనేక ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నంగునూరి రమేష్, వ్యవసాయ అధికారి భోగ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సునీల్ రాజ్, పంచాయతీ కార్యదర్శి మాలతి, ఉపాధ్యాయులు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్, టై బెల్టులు పంపిణీ




**తొవ్వ, నర్సింహులపేట, జులై. 15**
మండల కేంద్రం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చిన నోట్ బుక్స్ ఒక్కొక్కరికి నాలుగు చొప్పున 120 మంది విద్యార్థులకు 480 నోట్ పుస్తకాలు అందజేశారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అందరూ కలిసి విద్యార్థులకు ఐడి కార్డ్ లు బెల్టు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క%శ్రీ% కొండ్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎం శ్వేత, ఏ శ్రీనివాసు, బి. యాకన్న, వి జగన్, బి కృష్ణ, బి యాకసాయిలు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లోని సిహెచ్ సి, పీహెచ్సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**హన్మకొండ, జూలై 15**

కమలాపూర్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి, ఐపి, లేబరేటరీ, ఫార్మసీ, ఎక్స్ రే యూనిట్, పేషంట్లకు అందించే ఆహారం కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాలలోని ఆయా విభాగాలను సందర్శించి వాటి వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోర్టబుల్ ఎక్స్ రే మిషన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు కావలసినటువంటి ఫిలిమ్స్, రి ఏజెంట్స్ గురించి ఇండెంట్ చేయాలన్నారు. కమలాపూర్ ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రసూతి సేవల వివరాలను తెలుసుకొని గర్భిణీల చెక్ అప్, స్కాన్స్ సంఖ్య పెంచాలని అలాగే మండల పరిధిలోని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సాధారణ ప్రసవాలు అక్కడే జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ఆశాలు, ఏఎన్ఎం లతో ప్రత్యేకంగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓకు సూచించారు. ఆరోగ్య కేంద్రానికి కావలసినటువంటి మందులు సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుండి ఏ విధంగా అందుతున్నాయి, ఎలా రికార్డులు మెయింటైన్ చేస్తున్నారు స్టాక్ రిజిస్టర్ను పరిశీలించారు. వార్డులో అడ్మిట్ అయి ఉన్నటువంటి పేషెంట్స్ ను పలకరించి వారికి సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఇద్దరు డయేరియాతో అడ్మిట్ అయిన పేషెంట్స్ ఉండడంతో వారికి అందుతున్న తాగునీటిని పరిశీలించాలని ఎంపీడీవోని ఆదేశించారు. కమలాపూర్ లో ఏఏ రకముల టెస్టులు చేయడం జరుగుతున్నది అలాగే తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ కి ఏఏ పరీక్షల నిమిత్తం శాంపుల్స్ పంపిస్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న శానిటేషన్ సిబ్బంది వివరాలను తెలుసుకొని ఆస్పత్రిని ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ గౌతమ్ చౌహన్, డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, సిహెచ్సి సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్ ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, హెచ్ ఈ ఓ రవీందర్, పి హెచ్ ఎన్ లీలావతి, టిబి నోడల్ పర్సన్ ప్రభాకర్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమౌళి నాగరాజు, ఆరోగ్య పర్యవేక్షకురాలు అమృతమ్మ, ఆరోగ్య మిత్ర రవీందర్, హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ వివాదంలో ప్రాణభయం

**మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి**

**హుజురాబాద్, జూలై 15**

శంకరపట్నం మండలం, మొలంగూర్ (గుడాటిపల్లె) గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీధర్ రెడ్డి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, భూ వివాదాల నేపథ్యంలో గుర్రం సంజీవ్ రెడ్డి, కిషన్ రెడ్డి కుటుంబ సభ్యుల నుంచి తమకు న్యాయం కావాలని మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. శ్రీధర్ రెడ్డి తన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, 2006లో గుర్రం కిషన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి తమ తండ్రి పెద్ద మల్లారెడ్డికి సర్వే నెం. 231లో 8 గుంటల భూమిని విక్రయించారు. 2023లో శ్రీధర్ రెడ్డి తన పేరు మీద 4 గుంటలు, తన అన్నయ్య తిరుపతి రెడ్డి పేరు మీద 4 గుంటలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. గ్రామ పంచాయతీ నుండి అన్ని అనుమతులు పొంది, దాదాపు రూ. 15 లక్షలు ఖర్చు చేసి స్లాబ్ స్థాయి వరకు ఇంటి నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు కిషన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి కూడా హాజరయ్యారు. అయితే, వారి కుమారులు రాజేష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తూ, భూమిని తమ పేరు మీద రిజిస్టర్ చేయాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. పలు కోర్టు కేసులతో మానసిక వేదనకు గురి చేశారని, అన్ని తీర్పులు తమకు అనుకూలంగా వచ్చినా, బెదిరింపులు కొనసాగడంతో ఆ ఇంటిని అక్కడే వదిలేసి, ఎలాంటి వివాదాలు లేని తమ స్వంత భూమి సర్వే నెం. 239%దీ%/1లో ఇల్లు నిర్మించుకొని నివసిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ, గుర్రం సంజీవ్ రెడ్డి, కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులు తమపై పగ పెంచుకొని, తమ వ్యవసాయ బావిని పూడ్చివేసి, ఆరు గుంటల భూమిని




అమ్మివేయాలని బెదిరిస్తున్నారని శ్రీధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమి వెనుక వారికి రోడ్ ఫేస్ లభించాలనే ఉద్దేశ్యంతోనే ఇలా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. శంకరపట్నం సబ్ ఇన్‌స్పెక్టర్‌కు వారి పొలంలోని ఖనీలను తమ పొలంలో పడేసి ఫిర్యాదు చేశారని, హుజురాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు తమపై దాడి చేశారని తప్పుడు కేసులు పెట్టారని శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ విధంగా రకరకాలుగా అక్రమ కేసులు పెడుతూ, ఎలాగైనా భూమిని అమ్మించాలని బెదిరిస్తున్నారని ఆయన వాపోయారు. వారి నుండి తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, దీనిపై పూర్తి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని శ్రీధర్ రెడ్డి మానవ హక్కుల కమిషన్‌ను కోరారు.

# యువకుల పైననే దేశ భవిష్యత్తు

**పోటీ ప్రపంచంలో స్కిల్స్ డెవలప్మెంట్ ను మెరుగుపరచుకోవాలి**

**ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు**





**హన్మకొండ, జూలై 15**

భారతదేశ భవిష్యత్తు యువకులపై ఆధారపడి ఉందని యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జనగామ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. వరల్డ్ యూత్ స్కిల్స్ డే ను పురస్కరించుకొని మంగళవారం జనగామ పట్టణంలో సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వరంగల్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్కిల్స్ డెవలప్మెంట్ ఏర్పాటు చేయడం అభినందనం, ముఖ్యంగా ప్రతి పౌరుడు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఏ రంగంలో దూసుకెళ్లాలన్నా స్కిల్ డెవలప్మెంట్ మెరుగుపరచుకోవాలి కేవలం ఉద్యోగరీత్యమే కాకుండా ప్రతి రంగంలో ముందుకెళ్లలన్న ముఖ్యంగా మనం స్కిల్ డెవలప్మెంట్ ను మెరుగుపరుచు కున్నప్పుడే ప్రతి యువకుడుబంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. నెహ్రూ యూవ కేంద్ర పూర్వపు వాలంటరీ మండ రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత లక్ష్యం వైపు దూసుకెళ్లి తల్లిదండ్రుల ఆశయాల నెరవేర్చుకోవాలని ఈ మధ్య మనం చూస్తున్నాం డ్రగ్స్ యువత పెడదారి పడుతుంది అలాకాకుండా యువత బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వరల్డ్ యూత్ సందర్భంగా వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేయడం జరిగింది గెలుపు పొందిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ప్రథమ బహుమతి ఆదిత్య, ద్వితీయ బహుమతి దీలిప్, తృతీయ బహుమతివిష్ణు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరేందర్, సదానందం, రాజు, తదితరులు పాల్గొన్నారు

## కల్లు కాంపౌండ్లపై చర్యలు తీసుకోవాలి

**కల్తీ కల్లు బాధితులు పెరగడం ఎక్సైజ్, ఆబ్కారీ శాఖ అధికారుల నిర్లక్ష్యమే**

**ఎన్ హెచ్ ఆర్ సి. గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధి ఎస్వి సురేష్ రెడ్డి**

**హైదరాబాద్, జూలై 15**



నగరంలో పలుచోట్ల ప్రమాదకరమైన మత్తు పదార్థాలతో కల్లు తయా రుచేసి విక్రయిస్తున్నట్లు తెలిసినా కూడా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోక పోవడం వల్లే యదేచ్ఛగా కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధి ఎస్ వి సురేష్ రెడ్డి అన్నారు. దీనివల్ల నగరంలో కల్తీ కల్లు బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. నగరంలో పలుచోట్ల జరిపిన కెమికల్ ఎగ్జామినేషన్ లో ప్రమాదకరమైన ఆల్ప్రాజోలం పదార్థం ఉన్నట్లు తేలిందని అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే కల్తీ కల్లు విక్రయం నిరాటకంగా కొనసాగుతుం దని ఆయన అన్నారు. కల్తీ కల్లు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, ఆబ్కారీ శాఖ అధికారులు అందుకు విరుద్ధంగా చట్టంలోని లొసుగులను విక్రయదారులకు చెప్పి మరీ అమ్మకాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని ఆయన అన్నారు. హైదరాబాదులో తయారవుతున్న కల్లు 90 శాతం కల్తీయేనని అధికారులు ఇప్పటికే గుర్తించారని అయినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సంబంధిత అధికారుల పాత్రపై విచారణ చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసలు నగరానికి కనుచూపుమేరలో తాడిచెట్లు లేని విషయం అందరికీ తెలుసని అయినప్పటికీ నగరంలో 97 కల్లు దుకాణాలు ఉన్నట్లు అధికారికంగా లెక్కలు చెబుతున్నప్పటికీ అంతకుమించి అనధికా రికంగా ఇష్టానుసారం కల్లు దుకాణాలు నడుపుతున్నట్లు సమాచారం ఉందని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కల్లు దుకాణాల అనుమతులను రద్దు చేయాలని, వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు ఎలా వచ్చాయో సమగ్ర విచారణ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ తిరునగరి లావణ్య, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆవు మృతి

**ఎల్కతుర్తి, జూలై 15**



ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన రైతు రవి కి చెందిన ఆవు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వలన మంగళవారం మృతి చెందింది.ఏడాది క్రితం ట్రాన్స్ఫర్మార్ గద్దె నిర్మాణం పూర్తయినా ట్రాన్స్ ఫార్మర్ మార్చలేదు. ప్రమాదం పొంచి ఉన్న విషయాన్ని రైతులు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని రైతు ఆవేదన చెందాడు.ట్రాన్స్ ఫార్మర్ కింది గద్దె నుండి ఏర్పాటు చేసిన పై గద్దెకు మర్చితే ప్రమాదం జరుగకపోవు ఆవు మృతి చెందాకా పోవు అని అన్నారు. మృతి చెందిన ఆవు అరువై వేయిల రూపాయలు వుంటుందని తెలిపారు.నిర్లక్ష్యంగా వున్నా విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

## కాపు కాచి.. కాల్చి చంపి..

**కాంగ్రెస్ మెదక్ జిల్లా ఎస్సీ సెల్ నేత మారెల్లి అనిల్ దారుణ హత్య**

**సోమవారం రాత్రి మెదక్ జిల్లాలో ఘటన**

**అనిల్‌పైకి తుపాకీతో దుండగుల కాల్పులు**

**అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న కారు**

**తొలుత యాక్సిడెంట్‌గా భావించిన పోలీసులు**

**పోస్టుమార్టం సమయంలో బుల్లెట్ గాయాలు గుర్తించిన వైద్యులు**

**రియల్ ఎస్టేట్ వివాదాలే హత్యకు కారణమనే అనుమానాలు**

**మెదక్/ కొల్చారం, జూలై 15:** కాంగ్రెస్ ఎస్సీ సెల్ మెదక్ జిల్లా కార్యదర్శి మారెల్లి అనిల్ (28) దారుణ హత్యకు గురయ్యారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సమావేశానికి హాజరైన ఆయన.. తిరిగి వస్తుండగా మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామ సమీపంలో దుండగులు కాల్చి చంపారు. అనిల్ నడుపుతున్న కారు కల్వర్టును ఢీకొని ఉండటంతో.. అది రోడ్డు ప్రమాదమని పోలీసులు తొలుత భావించారు. పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు మృతదేహం దుస్తులు తొలగిస్తుండగా బుల్లెట్ గాయాలను గుర్తించారు. రియల్ ఎస్టేట్ వివాదాలే ఈ హత్యకు కారణం కావొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారమే అనిల్ పుట్టినరోజు అని, ఇలా శవమై తిరిగి వస్తాడని ఊహించలేదంటూ మెదక్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద ఆయన తల్లి యేసమ్మ కన్నీరు మున్నీరయ్యారు.

### పక్కాగా కాపుకాసి కాల్పులు

కొల్చారానికి చెందిన మారెల్లి అనిల్ సంగాయిపేటలో పెట్రోల్ బంక్ నడిపించడంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో భూములకు సంబంధించి పలువురితో అనిల్‌కు వివాదాలు ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఓ భూవివాదంలో ఏపీలోని రాయలసీమకు చెందిన ఓ వ్యక్తి కారును అనిల్ స్వాధీనం చేసుకున్నారని సమాచారం. అయితే అనిల్ సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యారు. రాత్రి తిరుగు ప్రయాణంలో ఉండగా హత్యకు గురయ్యారు. దుండగులు పక్కాగా రెక్కీ చేసి, పథకం ప్రకారం హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ఓ కారుతో ఆగంతుకులు వేచి ఉన్నారని సమీపంలోని ఓ రైస్ మిల్లు సీసీ కెమెరా పుటేజీలలో గుర్తించారు. వారు అనిల్ కారును అడ్డగించి, నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి ఉంటారని అంచనా వేస్తున్నారు. అనిల్ తప్పించుకునే ఉద్దేశంతో కారును వేగంగా ముందుకు పోనివ్వడంతో ఎదురుగా ఉన్న కల్వర్టును ఢీకొని ఉంటారని చెబుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. దేహంలో నాలుగు బుల్లెట్లు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దీనితో పోలీసులు క్లూస్‌టీం, ఫోరెన్సిక్ నిపుణులతో ఘటనా స్థలాన్ని పరిశీలించి, నాలుగు బుల్లెట్ కాట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు.



# ప్రతీకారం తీర్చుకుంటా

అడవి శేష్ 'డెకాయిట్' గ్లింప్స్ సినిమాపై విపరీతమైన బజ్ క్రియేటయ్యేలా చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 25న 'డెకాయిట్'ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు కూడా.

ఇదిలావుండగా.. కథానాయిక మృణాళ్ ఠాకూర్ ఈ సినిమాకు సంబంధించి చేసిన ఓ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. తన నుదుటికు తగిలిన గాయాన్ని చూపిస్తూ 'సబ్‌కా బద్లా లేగీ జూలియట్' అంటూ పోస్ట్ చేశారు మృణాళ్. ఈ ఫొటోలో తన పక్క అడవి శేష్ కూడా ఉండటం గమనార్హం. 'అందరిపై ప్రతీకారం తీర్చుకుంటా' అనేది ఈ పోస్ట్‌కు తెలుగర్థం. ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్‌లో మృణాళ్ ఠాకూర్‌ని అడవి శేష్ 'జూలియట్..' అని సంబోధించిన విషయం తెలిసిందే. పైగా ఇది ఓ బ్రేకప్ ప్రేమజంట మధ్య నడిచే ప్రతీకార కథ అని ఈ సినిమా టీజర్ ఇప్పటికే చెప్పేసింది. ఈ నేపథ్యంలో మృణాళ్ చేసిన ఈ పోస్ట్ సినిమాపై ఇంకొంచెం హైప్‌ని పెంచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. షనీల్‌డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, కామాక్షి భాస్కర్ల ఇతర తారాగణం.

# ధనుష్ 54 మొదలైంది



తమిళంతో పాటు తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉన్న హీరోల్లో ధనుష్ ఒకరు. ఇటీవలే ఆయన 'కుబేర' చిత్రంతో భారీ హిట్ దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆయన వరుసగా సినిమాల్ని అంగీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ధనుష్ 54వ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. డీ54 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. ఇషారి కె గణేష్ నిర్మాత. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా మొదలుపెడుతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ధనుష్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. హై ఇంటెన్సిటీ యాక్షన్ చిత్రమిదని, ధనుష్ పాత్ర కొత్త పంథాలో ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. మమితబైజు, కె.ఎస్.రవికుమార్, జయరామ్, కరుణాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తేని ఈశ్వర్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, దర్శకత్వం: విఘ్నేష్ రాజా.

# నలందా నేపథ్యంలో 'గేమ్ ఆఫ్ ఛేంజ్'



5వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నలందా విశ్వవిద్యాలయం నేపథ్యంలో జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో రూపొందిస్తున్న చిత్రం 'గేమ్ ఆఫ్ ఛేంజ్'. ఇంగ్లీష్, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా రానుంది. జాతీయ, అంతర్జాతీయ నటులతో ఈ చిత్రాన్ని రూపొందించారు. సిధిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సిద్ధార్థ్ రాజశేఖర్, మీనా చాబ్రియా నిర్మాతలు.త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా ఇటీవల విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గుప్తుడి కాలం నాటి యథార్థ సంఘటనలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని నిర్మాత, హీరో సిద్ధార్థ్ రాజశేఖర్ తెలిపారు. స్ఫూర్తివంతమైన కథాంశమిదని నిర్మాత మీనా చాబ్రియా పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీరాజ్ సాజి, దర్శకత్వం: సిధిన్.

# 4000కోట్లతో రామాయణ



భారతీయ పురాణేతిహాసం రామాయణం దశాబ్దాలుగా వెండితెరపై ప్రేక్షకుల్ని అలరిస్తూనే ఉంది. ఇప్పటికే తెలుగుతో పాటు వివిధ భారతీయ భాషల్లో రామాయణగాథ పలుమార్లు వెండితెర దృశ్యమానం అయిన విషయం తెలిసిందే. తాజాగా నితేశ్ తివారీ దర్శకత్వంలో రామాయణం మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. 'రామాయణ' పేరుతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సీతారాముల పాత్రల్లో సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్నారు. రావణాసురుడిగా కన్నడ అగ్ర నటుడు యష్ కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే తొలిభాగానికి సంబంధించిన యాభైశాతం చిత్రీకరణ పూర్తయింది. తాజాగా ఈ సినిమా బడ్జెట్ గురించి నిర్మాత నమిత్ మల్హోత్రా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. దాదాపు 4000కోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలను తెరకెక్కించబోతున్నామని, ఇది భారతీయ సినిమాలో రికార్డని, మరే చిత్రం 'రామాయణ' దరిదాపుల్లోకి కూడా రాదని అన్నారు. 'ఈ సినిమా కోసం మేము సొంతంగా నిధులు సమకూర్చుకుంటున్నాం. ఈ ఇతిహాసాన్ని ప్రపంచమంతా చూడాలన్నదే మా సంకల్పం. ఈ ప్రాజెక్ట్‌తో ప్రపంచ సినిమా భారత్‌వైపు చూస్తుంది. తరాలు మారినా, యుగాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే' అని నమిత్ మల్హోత్రా అన్నారు. 'రామాయణ' తొలిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది.

# పూజా హెగ్డే బ్యాడ్ టైం..

## స్టార్ హీరో మూవీ నుండి ఔట్..!

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీవల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టుకుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది. తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలికమేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146